చెప్పడానికా అనే సంశయం నన్ను ఆవహించింది. చివరకు తెలుగుపత్రికలంటే ఆంగ్లవిద్యాధికులకుండే అలక్ష్యం ఇలా ఉంటుంది కాబోలు అనుకొని సమాధాన పరుచుకొన్నాను.

తెలుగుపత్రికలు ఆడవాళ్లుమాత్రం చదవాలసిన పత్రికలనే భావం కూడ కొందరి కుందనే సంగతి అప్పుడే తెలిసింది.

ఇంత హడావుడిగా న్యూస్ చదివే ఇలాంటి ప్రముఖులు ఆంధ్రపత్రికల వల్ల న్యూస్ తెలుసుకోరాదూ? ఆంధ్రపత్రికలలో న్యూస్ ఆలస్యం అవుతుందనే అనుమానముంటేమో అంటే, గాంధి ఇర్వినుల రాయబారము చెడిపోయిందనే వార్త లక్ష్మీవారంనాడు తెలిసినా ఆయన కొకటే, శుక్రవారంనాడు తెలిసినా ఒకటే. తెలుగుపత్రికలంటే అసలు యజమానులకుండే అలక్ష్యంవల్లనే వి.పి.లు తిరిగి పోతూవుంటాయి. గుమాస్తాగారు అయ్యగారు చదివే ఆంగ్లపత్రికకే చెల్లిస్తారు గాని మిగతాపత్రికలకు సొమ్ము చెల్లించడానికి విముఖులౌతారు. ఆంగ్లవిద్యావేత్తలలో దేశభాషాపత్రికలయెడ అలక్ష్యం పోతే పత్రికలు వృద్ధిపొంది దేశాభ్యుదయానికి తోడ్పడతాయి.

* * * *

దేశభాషాపత్రికలు ముఖ్యముగా అభివృద్ధిపొందితేగాని దేశానికి మోక్షం లేదనే విషయం నిస్సంశయము. దేశంలో నేడు కనిపించే సర్వతోముఖమైన ఉత్సాహానికి కారణం తెలుగుపత్రికలే. దేశభాషాపత్రికల మూలా ప్రజలకన్న ప్రభుత్వానికి బాగా ఎరుక. ఎక్కువగా సామాన్యజనుల కండుబాటులోనుండి వారిలో కార్యోత్సాహమును పురిగొల్పేవి దేశభాషాపత్రికలే. అందుచేత దేశభాషాపత్రికల అభివృద్ధికి తోడ్పడవలసినబాధ్యత ప్రజలపై నున్నది, ఆంగ్లవిద్యాధికులు అలక్ష్యాన్ని వదలివేసి తెలుగుపత్రికలకు అన్నివిధాల తోడ్పడుట మిక్కిలి అవసరము. ఆంగ్లపత్రికలు చదువుటలో ప్రత్యేక గౌరవముందనే భావం, తెలుగుపత్రికలలో ఏముందనే అలక్ష్యభావం ఆంగ్లవిద్యాసంపర్కముగల తెలుగువారి మనస్సుల్లోంచి తొలగిపోతే పత్రికలు బాగుపడుతాయి.

* * * *

ఇంతవరకు తెలుగుపత్రికల ప్రస్తుతస్థితికి కారణాలను ఆంగ్లవిద్యాధికులపై పడేశాను. కాని అంతమాత్రమున తెలుగుపత్రికలు ఎట్టిలోపాలు లేకుండా ఉన్నాయని చెప్పడానికి వీలులేదు. తెలుగువారిలో తెలుగుపత్రికలయెడల గల అలక్ష్యభావాన్ని తొలగించడానికి తెలుగుపత్రికలు వార్తాప్రచారం విషయంలో అభివృద్ధి చూపి తోడ్పడాలి. పత్రికాసమ్మేళనం సందర్భంలో ముట్నూరివారు పత్రికల లోపాలన్నిటిని విపులపరిచియేయున్నారు. సంపాదకులు సంస్కారులు కాకపోవడంవల్లనైతేనేమి, ధనాభావంచేతనైతేనేమి, మరే కారణాలవల్లనైతేనేమి అనేకలోపములున్నాయి. ఒక్కటే దినపత్రికగాను నాగేశ్వరరావు పంతులవారి వంటి శ్రీమంతుని అండనున్న ఆంధ్రపత్రిక ఆంధ్రరాష్ట్రానికి శఖండమైన సేవచేసినా, ఉండవలసినంత సర్వాంగసుందరంగా లేదు. పత్రికలో వార్తలకొరకు వెదకకోవాలి. పత్రికలో పడే వ్యాసాలపై కొంచెం ఎక్కువ నిఘా ఉండాలి. వార్తలు ప్రచురణ ఆలస్యం కాకూడదు. ఇతర పత్రికల లోపాలను లెక్కపెట్టడమే కష్టము. ఆర్థికంగా ఆంధ్రకృష్ణాపత్రికలుతక్క మిగిలినపత్రికలు "పిట్టనికొట్టి పొయ్యిలోపెట్టు" అనే సామెతగా జీవయాత్ర నడుపుతూన్నవి. అందుచే అభివృద్ధికి సావకాశమెక్కడ? పత్రికలు బాగాఅభివృద్ధి చెందాలంటే పదిమంది అన్నివిధాల ఆదరించి తోడ్పడాలి. బాగాఉంటేనే కాని నలుగురూ ఆదరించరు. పెళ్లి అయితేనేగాని పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరితేనేగాని పెళ్లి కాదు, ఈస్థితిగా ఉంది తెలుగుపత్రికలసంగతి. ఈస్థితిని తొలగించడానికొకటే మార్గం. పత్రికల లోపాలను భరించి తెలుగుదేశంలో విద్యావంతులు, ధనికులు తెలుగుపత్రికలు చదివి ఆదరిస్తే అచిరకాలంలో ఈపత్రికలు దేశకళ్యాణానికి కారణమవుతాయనుటకు సంశయం లేదు. ఆంధ్రమహాజనుల కీసత్సంకల్పం కలుగు గాక!

## శరణు

శ్రీ. కె. నారాయణాచార్యులు గారు, ఆంధ్రగీర్వాణ సాహిత్య పరిషత్తు

ఇంతకాలముదనుక నే నింతయేని
తావకీనపదాంబుజ ద్వంద్వసక్త
మానసుండ నౌచు భవదీయమహిమములను
దెల్పుచుండెడి చదువుల తెన్ను లేని
గానఁగా లేదు పాపపుఁగర్మము లన
పావకంకారహితుఁడనై బహుముదమున
నాచరించితి క్షమియింపు మంబుజాక్ష!
పుణ్యలక్ష్మీంద్ర! శరణు! కారుణ్యసాంద్ర!

సంతతము పాపచింతల సల్పుచుంటి
మానసంబున నుండు నిన్ ధ్యానమందు
నిర్మలం బగు మానసనీరజాత
పీఠమందు న నిల్పి సంప్రీతితోడ
హృదయకుసుమార్చనంబుల నింపు మీరఁ
జేసి మాం పాహి! మాం రక్ష! శీఘ్ర మంచు
వేడుకొనలేమిఁ గరుణించు! విశ్వరూప!
పుణ్యలక్ష్మీంద్ర! శరణు! కారుణ్యసాంద్ర!

ఆ చతుర్ముఖఘాస పర్యంతమునను
సకలదృశ్యప్రపంచ వస్త్వాఘమందు
నాయతానాయతంబుల నాశ్రయించి
వ్యాప్తిఁజెందుచు నుండు నీ గుప్తమార్గ
ములను సుజ్ఞానదృక్కులఁ దెలసికొనక
స్థిరతరానూనభక్తి వర్తింప లేను
మోసపోయితి క్షమియింపు మో సురేశ!
పుణ్యలక్ష్మీంద్ర! శరణు! కారుణ్యసాంద్ర!

సృష్టిలో నీ యథేచ్ఛ విచిత్రములను
సర్వతంత్రస్వతంత్రతఁ జరిపినావు
తావకీనస్వతంత్రతాతనుతఁ దరమె
వర్ణనము సేయ మాదృశ పరమమూఢ
చిత్తులకు? నీవు సత్కృపఁ జింత సేయ
మంచియే చెడ్డ చెడ్డయె మంచిగాను
బరిణమించును; గరుణించు పరమపురుష!
పుణ్యలక్ష్మీంద్ర! శరణు కారుణ్యసాంద్ర!